

బస్ షెల్టర్లేవి..?
మండల కేంద్రాల్లో బస్ షెల్టర్లు లేకపోవడం, ఉన్నవి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో ▸



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి
బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. 8లో ▸



బిల్లులు చెల్లించండి
మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

సత్యనారాయణకు డాక్టరేట్



సత్యనారాయణకు పట్టా అందజేస్తున్న ప్రొ. కాశీం

కొడంగల్ రూరల్: మండలంలోని పర్సాపూర్‌కు చెందిన బానకారి సత్యనారాయణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో 'బహుజన సాహిత్య శిల్పి కాలువ మల్లయ్య' అనే అంశంపై ప్రొఫెసర్ మసన చెన్నప్ప పర్యవేక్షణలో పరిశోధన చేశారు. పరిశోధన విజయవంతంగా ముగియడంతో సత్యనారాయణకు ప్రొఫెసర్ కాశీం డాక్టరేట్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గ్రామం నుంచి మొదటి పీహెచ్‌డీ చేసిన వ్యక్తి కావడం గర్వంగా ఉందన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు హర్షణీయం

కిసాన్ మోర్చా
రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

పరిగి: రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. ఆదివారం పరిగి బస్టాండ్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలతో కలసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను ప్రధాని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికం

- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పని అయిపోయింది
- మంత్రి మహేందర్‌రెడ్డి
- చించల్‌పేట, ముబారక్‌పూర్‌లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



ముబారక్‌పూర్ వద్ద మూసీ నదిపై బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

నవాబుపేట: మూసీ నదిపై వంతెనల నిర్మాణంతో ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చించల్‌పేట, ముమారక్‌పూర్ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి రూ. 15 కోట్ల 49 లక్షల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముబారక్‌పూర్‌లో మూసీ నదిపై బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ నది వల్ల సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. మండలంలోని చించల్‌పేట, ముబారక్‌పూర్ గ్రామాల వద్ద రెండు వంతెనలు నిర్మించడంతో ఇక్కడి ప్రజల కష్టాలు తీరాయన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నేడు తెలంగాణ దేశానికే తలమానికంగా మారిందన్నారు. దేశంలో ఎక్కడా దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు లేవన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదన్నారు. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కావడం లేదని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సైతం తెలంగాణ తరహా పథకాలు అమలు కావడం లేదన్నారు. ఇక్కడ మాత్రం ఆ రెండు పార్టీలు ఆచరణకు నోచుకోని హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య మళ్లీ గెలుస్తారని, ఆయన ప్రజల మనిషి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీలు జయమ్మ, శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచులు శ్రీనివాస్, బాలమణి, ఎండీ రఫీ, బల్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పర్మయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టి.. కొలువు కొట్టి..

- చెంగోల్‌కు చెందిన ఇద్దరికి కానిస్టేబుల్ ఉద్యోగాలు
- అభినందించిన గ్రామస్తులు



అశోక్‌కుమార్

తాండూరు రూరల్: ఉద్యోగం సాధించాలనే తపన.. రాత్రి, పగలు శ్రమించారు.. వారికి ఇష్టమైన పోలీస్ కొలువు కొట్టారు. తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు.

వ్యవసాయ కూలీ కొడుకు

చెన్నారం ఆశప్ప, పద్మమ్మ దంపతుల రెండో కొడుకు అరవింద్. పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆశప్పకు రెండెకరాల పొలం ఉంది. వ్యవసాయంతో పాటు కూలీ పని చేస్తు కొడుకులకు చదివించాడు. తల్లి పద్మమ్మ కూలీ పనులు చేస్తుంది. తల్లిదండ్రుల కష్టాన్ని చూసిన అరవింద్ పోలీస్ ఉద్యోగం సాధించాలనే కసితో సాధన చేసి అనుకున్న లక్ష్యం చేరుకున్నాడు.

తండ్రి లేకున్నా మనోధైర్యంతో..

చిన్నప్పుడే తండ్రి చనిపోయారు. మనో ధైర్యంతో ముందుకు సాగాడు. కష్టపడి పోలీస్ ఉద్యోగం సాధించాడు బైండ్ల అశోక్‌కుమార్. బాల్యంలో తండ్రి చనిపోవడంతో కిరాణా దుకాణం, పెట్రోల్ బంక్‌తో పాటు కూలీ పనులు చేసుకుంటూ చదువుకున్నాడు. కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన యువకులు అరవింద్, అశోక్‌కుమార్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడంతో వివేకానంద యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



తండ్రి ఆశప్పతో అరవింద్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ క్లీన్ స్వీప్ ఖాయం

- రాష్ట్రంలో రానున్నది హస్తం ప్రభుత్వమే
- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి క్లీన్ స్వీప్ చేస్తుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మనోహర్‌రెడ్డి పార్టీలో చేరిన సందర్భంగా ఆదివారం భీంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్‌లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తారని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎటువంటి బాధ్యతలు అప్పగించినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజాభీష్టం మేరకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తాండూరు అభ్యర్థి ఎంపిక అధిష్టానం చేతుల్లో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎంపీటీసీ ఆనందం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాంచంద్రయ్య, మొగులయ్య, శ్రీనివాస్, రాంచందర్, షర్ఫొద్దీన్, భరత్‌కుమార్, రఘునాథ్ రెడ్డి, భాస్కర్, నర్సింలు, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల నుంచి అగ్రగామిగా నిలిపాం

నష్టాల్లో ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీని ప్రత్యేక ప్రణాళికతో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపామని ఆ బ్యాంక్ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. కుల్కచర్లలో రూ. 50లక్షలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘ భవనాన్ని, రూ. 40 లక్షలతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను, రూ. కోటి 75లక్షలతో నిర్మించిన గోదాం, రైస్ మిల్లును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వివరించారు. ప్రతి సహకార సంఘానికి రూ. 150కోట్లతో గోదాం నిర్మిస్తున్నట్లు వివరించారు. ధాన్యం సేకరణలో సైతం సహకార సంఘాలు శక్తిని మించి పనిచేయడం జరిగిందన్నారు. ప్రజలు, రైతులు తమను నమ్మి పదవి ఇచ్చారని, వారి శ్రేయస్సు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో రైతులకు మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, డైరక్టర్లు కొండయ్య, నర్సింలు, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, డీసీసీబీ మేనేజర్ వెంకటయ్య, నాయకులు ఆంజనేయులు, కృష్ణయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లేకుండానే..

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మూడు రోజుల క్రితం అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. తాండురు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి లేకుండానే తన శాఖ పరిధిలోని అభివృద్ధి పనులను ప్రారంభించారు.

క్లుప్తంగా

పర్సంటేజీలు వసూలు చేస్తే కేసులే

తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ద్వారా కమీషన్‌లు, పర్సంటేజీలు వసూళ్లకు పాల్పడితే కేసులు నమోదు చేయిస్తామని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు ద్వారా రూ.10లక్షలు అందిస్తున్నామన్నారు. ఈ విషయంలో లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దళితబంధు పథకం ఇప్పిస్తామని దళారులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తన దృష్టికి తీసుకరావాలన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులను సైతం హెచ్చరిస్తున్నామన్నారు. పార్టీకి చెందిన వారు ఎవరైనా వసూళ్లకు పాల్పడినట్లు తెలిస్తే వారిని పార్టీలో నుంచి బహిష్కరిస్తామన్నారు. దళితబంధు పథకంతో పాటు బీసీ బంధు, మైనార్టీ బంధు లబ్ధిదారులు సైతం ఎవరికీ ఒక్కపైసా ఇవ్వొద్దన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

ధారూరు: గ్రామాలు, తండాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేస్తున్నామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ధారూరు మండల పరిధిలోని నర్సాపూర్, కుక్కింద, గడ్డమీది గంగారం, అల్లాపూర్, ఎబ్బనూర్, తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి, మైలారం, కుమ్మర్‌పల్లి, చింతకుంట, హరిదాస్‌పల్లి, అంపల్లి తదితర గ్రామాల్లో రూ. 2.20 కోట్ల పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మరోసారి సీఎం చేయాలన్నారు. అనంతరం తరిగోపుల గ్రామంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొస్నం సుజాత, మండల అధ్యక్షుడు రాజునాయక్ మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు సంతోష్, అంజయ్యలు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజుగుప్తా, రవికుమార్, రాములు పాల్గొన్నారు.

కొండా వైపే మొగ్గు ?

- విశ్వేశ్వర్‌రెడ్డికి ఇచ్చేందుకు అధిష్టానం సుముఖత
- పోటీ చేసేందుకు అనాసక్తి చూపుతున్న మాజీ ఎంపీ



తాండూరు: తాండూరు అసెంబ్లీకి కమల దళపతిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి టికెట్ ఇచ్చేందుకు బీజేపీ అధిష్టానం నేతలు సుముఖత చూపిస్తున్నారు. అందుకోసం అమావాస్య తర్వాత బీజేపీ నేతలు తొలిజాబితా విడుదల చేయనున్నారు. మరో వారం రోజుల వ్యవధిలో తాండూరు అభ్యర్థి ఎవరనేది స్పష్టత రానుంది. అయితే ఇప్పటికే మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి తాండూరు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే కొండా మాత్రం పోటీ చేసేందుకు సుముఖత చూపించడం లేదని అతని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల విషయంలో పోటీ చేయాలని ఇంకా అలోచించలేదని, స్పష్టత రావడానికి ఇంకా కొంత సమయం పడుతోందని మాజీ ఎంపీ అనుచరుడు స్పష్టం చేశారు.

తండ్రి మందలించాడని కొడుకు ...

ఇబ్రహీంపట్నం రూరల్: పనికి వెళ్లలేదని కుమారుడిని తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి పారిపోయాడు. ఈ ఘటన ఆది బట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. అర్కపల్లి జంగయ్య అనే వ్యక్తి మన్నెగూడలో నివాసం ఉంటాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు. ఆరు నెలలుగా పనికి వెళ్లకుండా కుమారుడు యాదగిరి ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో ఈ నెల 4వ తేదీన యాదగిరిని గట్టిగా మందలించాడు. అ ప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. కుమారుడి ఆచూకి తెలియకపోవడంతో తండ్రి పోలీసులకు పి ర్యాదు చేశాడు. పోలీసులు కేసు న మోదు చేసుకొనివిచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బస్ షెల్టర్లేవి..?

- నిలువ నీడ లేక ఇబ్బందుల్లో ప్రయాణికులు
- సౌకర్యాల కల్పనపై విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు

దోమ: నిత్యం వందలాది మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లు ఉండవు, షెల్టర్లు కానరావు. బస్సులను మాత్రం ఎక్కడ పడితే అక్కడే ఆపుతున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడమే కాకుండా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు మండల కేంద్రాల్లో బస్సు షెల్టర్లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులనుంచి టిక్కెట్ల రూపంలో చెల్లించే ఛార్జీలతో ఆర్టీసీకి ఆదాయం చేకూరుతుంది. సంబంధిత అధికారులు బస్‌స్టాప్, బస్‌షెల్టర్ల కల్పనలో మిన్నకుండి పోవడం బాధాకరమని సదరు ప్రయాణికులు వాపోతున్నారు. వర్షం కురిసినా, ఎండ కాచిన ప్రయాణికులకు మాత్రం నిలువనీడ కరువయ్యాయి. ఈ విషయంలో ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొంటూ బస్సుల కోసం వేచి ఉండాలంటే ఆటోలు, హోటళ్లు, కిరాణ దుకాణాలు, చెట్ల కింద నిల్చోవల్సిన దుస్థితి దాపురించాయి.

మరమ్మతులకు నోచుకొని బస్‌షెల్టర్లు..

దోమ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రధానంగా దోమ, ఐనాపూర్, పాలేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, మల్లేపల్లి, బుద్లాపూర్, దిర్సంపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలో నిత్యం ప్రయాణికులు వివిధ గ్రామాలు, పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఆయా గ్రామాల్లో ఇప్పటికి బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల సంవత్సరాల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్లు ఉన్నప్పటికీ అవి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెత్తా, చెదారం పేరుకుపోయి నిరుపయోగంగా తయారయ్యాయి. వాటిని మరమ్మత్తులు చేయించాలనే ఆలోచన అధికారులకు రావడం లేదు.

కనీస వసతులు కరువు..

ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదని ఆయా గ్రామాల ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్‌షెల్టర్లను మరమ్మతులు చేయకపోవడం, కనీస వసతులను కల్పించకపోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రధానంగా టాయిలెట్ల సౌకర్యాలు లేక మహిళా ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఎండలు, వానలు లేక్క చేయకుండా రోడ్డుపైనే నిల్చోల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సంబంధిత అధికారులు వానకాలం, వేసవిని దృష్టిలో పెట్టుకొని మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.



దిర్సంపల్లిలో అపరిశుభ్రంగా బస్‌షెల్టర్

చర్యలు తీసుకోవాలి..



గ్రామాల్లో పలు చోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా, అవి నిరూపయోగంగా మారాయి. పలు గ్రామాల్లో ఇప్పటికి బస్ షెల్టర్లేని దుస్థితి నెలకొన్నాయి. ప్రస్తుతం ఉన్న బస్‌షెల్టర్లలో చెత్తా, చెదారం పేరుకుపోయి శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా తయారయ్యాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. – ఆర్ రాములు, ఎంపీటీసీ, బొంపల్లి

బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయండి..



బస్‌షెల్టర్ లేక మండల కేంద్రంలో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంతో పాటు వేసవి కాలంలో ప్రయాణికులు, విద్యార్థులు చెట్ల కింద, హోటళ్లలో నిల్చోవాల్సి వస్తుంది. కనీసం షెడ్లు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొంది. అధికారులు వెంటనే బస్‌షెల్టర్లను ఏర్పాటు చేసి అవసరమైన వసతులను కల్పించాలి. – మాలి విజయ్‌కుమార్ రెడ్డి, దోమ

లారీ కిందపడ్డ బాలుడు

- సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదం
- తృటిలో తప్పిన ప్రాణాపాయం



చికిత్స పొందుతున్న అక్షిత్

తాండూరు టౌన్: సైకిల్‌పై వెళుతున్న ఓ బాలుడు ప్రమాదవశాత్తు లారీ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన తాండూరు పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకినగర్‌కు చెందిన అక్షిత్ స్థానిక నారాయణ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. ఆదివారం ఇంటి నుంచి స్నేహితుడి ఇంటికి సైకిల్‌పై వెళుతుండగా, వెనుకనుంచి వచ్చిన లారీ కింద ప్రమాదవశాత్తు సైకిల్‌తో సహా కిందపడ్డాడు. ఈ ఘటనలో బాలుడి కాలు విరిగింది. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి బీఆర్‌ఎస్‌తో సాధ్యం



పోతిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు



పరిగి: చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి
- మత్స్యకారుల భవనం ప్రారంభం

దోమ: రాష్ట్ర అభివృద్ధే బీఆర్‌ఎస్‌తో సాధ్యమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ముగ్గురు కాంగ్రెస్ వార్డు సభ్యులతో పాటు పలువురు నేతలతో పాటు సుమారు 100 మంది జెడ్పీటీసీ నాగిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, వాటిని చూసి ఇతర పార్టీల నేతలు పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటి పథకాలు మోసపురితమైనవని, ప్రజలు వాటిని నమ్మొదని సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఓటమితో రాష్ట్రంలో గల్లంతవుతాయన్నారు. దోమ మండల కేంద్రంలో మత్స్యకారుల నూతన భవనాన్ని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ప్రారంభించారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మత్స్యకారులకు సకాలంలో చేప పిల్లలను అందిస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాష, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజగోపాలచారి, బొంపల్లి ఎంపీటీసీ రాములు, ఉపసర్పంచ్ రఫీక్ పాషా, మండల అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, షఫీ, పవన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

చాకలి ఐలమ్మ పోరాటం మరువలేనిది

పరిగి: తెలంగాణ సాయుధపోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనివని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం దొరల పాలన నుంచి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. పేద ప్రజల సంక్షేమానికి భూమికోసం, భుక్తి కోసం పోరాటం చేసిన యోధురాలు అని గుర్తు చేశారు. ఆమె విగ్రహం పట్టణంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రావుపల్లి బీటీ రోడ్డు, నర్సయ్యగూడ బీటీ, పట్టణ కేంద్రంలోని ఐదోవార్డులో సైడ్ డ్రైన్ తదితర పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సయ్యగూడ ప్రజలు బీటీ రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీటీ రోడ్డు లేని గ్రామాలన్నింటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇంకా ఏమైన సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, సయ్యాద్‌పల్లి వెంకటయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

- దళితబంధు ఇవ్వడంలేదని ఆరోపణ
- పేదలకు న్యాయం చేయాలని దళితుల మొర
- దిష్టిబొమ్మ దహనం

ధారూరు: అర్హులైన పేదలకు దళితబంధు ఇవ్వకుండా కమీషన్లు తీసుకుంటూ అనర్హులకు ఇవ్వడంపై నాగారం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, దళితులు ఆదివారం నిరసన చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసేందుకు ప్రయత్నించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన దళితులు ధర్నా చేపట్టారు. కోపోద్రిక్తులైన వారు ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మైలారం గ్రామానికి వెళుతున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన దళితులను అక్కడే ఉన్న పోలీసులు నిలువరించారు. నిరసన వ్యక్తం చేస్తున్న దళితులను పోలీసులు వీడియో తీశారు. ఈ సంఘటనకు భయపడని వారు అనర్హులకే దళితబంధు, గృహలక్ష్మి పథకాలను వర్తింపజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కమీషన్లు తీసుకొని ధనవంతులకు, భవంతులు ఉన్న వారినే ఎంపిక చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సరైన విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం వారు దూడలకు(పశువులకు) తమ బాధలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, నర్సింహులు, వెంకటయ్య, శ్రీనివాస్, బందెయ్య, పరమేశ్, లక్ష్మణ్, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దళిత నాయకులు

గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం



కాంగ్రెస్‌లో చేరిన కొత్లాపూర్, రావులపల్లి నాయకులతో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు చాకలి శివరాజ్, పట్లూరి రవి, బోయిని శేఖర్, నల్లోల్ల ఆశన్న, రావులపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు పరిగి కృష్ణ, సూరం రమేశ్‌తో పాటు వారి అనుచరులు సుమారు 30 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నగరంలోని ఆయన స్వగృహంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలు పేద ప్రజల జీవన స్థితిగతులు మార్చే విధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

పంచలింగాలలో..

మండల పరిధిలోని పంచలింగాలలో కాంగ్రెస్‌కు మంచి స్పందన లభించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ అన్నారు. గ్రామంలో కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ కరపత్రాలను ఇంటింటికి తిరిగి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాజు, శేఖర్, బాగయ్యలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో వన్ మేన్ షో !

బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపణ

- కాంగ్రెస్‌లో చేరడంతో అంతుపట్టని రాజకీయం
- చోటామోటా నేతలంతా ఢిల్లీలో చేరిక
- తాండూరు అసెంబ్లీ స్థానం కోసమే చేరారంటున్న అనుచరగణం
- పరిగి అసెంబ్లీలో నూతనోత్సాహం



కేఎల్‌ఆర్ మాజీ ఎమ్మెల్యే



బుయ్యని మనోహర్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్

తాండూరు: డీసీసీబీ చైర్మన్ ప్రముఖ వ్యాపారవేత్త బుయ్యని మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరడం వెనుక మర్మమేమిటనేది రాజకీయ వర్గాల్లో అంతుచిక్కని ప్రశ్నలా మారింది. బీఆర్‌ఎస్‌లో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి వర్గంలో కీలక నేతగా ఉండటంతోపాటు మంత్రి కేటీఆర్‌తో సాన్నిహిత సంబంధాలున్నాయి. అలాంటి నేత పార్టీ వీడేందుకు సిద్ధమైతే బీఆర్‌ఎస్‌లో ఏ ఒక్క నేత ఇప్పటి వరకు స్పందించకపోవడం గమనార్హం. అయితే బుయ్యని మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే ఢిల్లీలో లేదా గాంధీభవన్‌లో పార్టీ కండువా వేసుకోవాలి. కాని చిన్నపాటి కార్యకర్తలా తాండూరులో చేరడం వెనుక కాంగ్రెస్‌లో ఆగ్రహజ్వాలలు ఎగిసి పడుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోనే వ్యాపారవేత్తగా ఖ్యాతి గాంచిన బుయ్యని మనోహర్‌రెడ్డి నాటకీయ పరిణామాల నడుమ కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ హోదాలో కొనసాగుతున్నారు. మనోహర్‌రెడ్డి పరిగిలో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. మరోవైపు తన సొంత నియోజవకర్గంలో పర్యటించాలని అధికార పార్టీ నేతలు ఆంక్షలు విధించారంటూ ఆందోళనకు గురయ్యారు. బీఆర్‌ఎస్‌లో వన్‌మెన్ షో కొనసాగుతుందంటూ ఇక పార్టీలో కొనసాగడం కష్టమంటూ ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరిన మనోహర్‌రెడ్డికి తన సొంత నియోజకవర్గమైన పరిగిలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి టికెట్ ఖాయమని తెలుస్తోంది. దీంతో రామ్మోహన్‌రెడ్డి చొరవతో తాండూరు అసెంబ్లీ స్థానాన్ని మనోహర్‌రెడ్డికి కేటాయిస్తే ఇటు పరిగి నియోజకవర్గంలోని మనోహర్‌రెడ్డి అనుచరగణమంతా కాంగ్రెస్‌కి మద్దతు పలకడంతో పార్టీ గెలుపు అవకాశాలు అధికమయ్యాయంటూ పార్టీ నేతలు అంటున్నారు. మరోవైపు తాండూరు నియోజకవర్గంలో దశాబ్దానికి పైగా బుయ్యని సోదరులు రైస్ మిల్లుతో పాటు ఆర్‌బీఎల్ పరిశ్రమ ద్వారా తమ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు.

టికెట్ కోసం సర్వే..

కాంగ్రెస్ అధిష్టానం అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ముగ్గురు కాంగ్రెస్ నాయకులకు సంబంధించి తాండూరు నియోజకవర్గంలో సర్వేలు నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తవుతుంది.

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ అభ్యర్థి అంటూ ప్రజల్లోకి..

తాండూరు అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే కేఎల్ ఆర్ అభ్యర్థిగా వస్తారంటు ఇప్పటికే నియోజవకర్గంలోని మారుమూల గ్రామ ప్రజల వరకు వెళ్లింది. నెల రోజుల క్రితమే నియోజవకర్గంలో వాల్‌పోస్టర్లను అంటించారు. కేఎల్ ఆర్ అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ సభ్యులు, తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ సైతం మద్దతు పలికారు. అయితే మనోహర్‌రెడ్డి తాండూరు పట్టణంలో పార్టీలో చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో తాండూరు అసెంబ్లీకి చేతి గుర్తు ఎవరిని వరిస్తోందనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

టికెట్ కోసం పోటీ పడుతున్న ఇద్దరు నేతలు..

తాండూరు అసెంబ్లీకి కాంగ్రెస్ టికెట్ కోసం ఇద్దరు నేతలు తీవ్రంగా ఢిల్లీ స్థాయిలో లాబియింగ్ చేస్తున్నారు. వారం రోజులుగా మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఢిల్లీలో మకాం వేశారు. అయితే ఇటీవల పార్టీలో చేరిన డీసీసీబీ మాజీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై భారం వేశారు. దీంతో మనోహర్‌రెడ్డికి టికెట్ ఇప్పించే బాధ్యత రేవంత్‌రెడ్డి భుజస్కంధాలపై వేసుకొన్నారు. తన నియోజకవర్గం ఆనుకొని ఉన్న తాండూరు సీటు విషయంలో రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది.



కాంగ్రెస్

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

- ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ

పరిగి: దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వారి సమ్మెకు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 14 రోజులుగా సమ్మె చేపడుతున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తున్నప్పటికి ప్రభుత్వం వారిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. చాలి చాలని జీతాలో వారు ఉద్యోగాలను చేస్తూ తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ, యాదమ్మ, సుజాత, రజిని, లలిత, ఉమాదేవి, పద్మ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశలు